

వేములవాడ ఏరియా దవాఖానలో పండంటి బాబుతో జడ్జి జ్యోతిర్మయి

సర్కారు దవాఖానలో జడ్జి ప్రసవం

సాధారణ కాన్పు చేసిన వైద్యులు.. తల్లీ బిడ్డా క్షేమం

వేములవాడ, మే 19: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జ్యోతిర్మయి వేములవాడ ప్రభుత్వ దవాఖానలో పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. రెండోసారి కూడా సాధారణ కాన్పు కాగా, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్టు వైద్యురాలు సంధ్యారాణి తెలిపారు. మొదటి కాన్పు కూడా ప్రభుత్వ దవాఖానలోనే కాగా, రెండో ప్రసవం అక్కడే అయింది. వంద పడకల ఇక్కడి దవాఖానలో వైద్యసేవలు చాలా బాగున్నాయని జడ్జి జ్యోతిర్మయి తెలిపారు.

అప్పుల బాధ తాళ లేక..

సిద్దిపేటలో ఒకే కుటుంబంలో ఐదుగురు అదృశ్యం

సిద్దిపేట టౌన్, మే 19 : అప్పుల బాధ తాళలేక ఓ కుటుంబం అదృశ్యమైన ఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. సిద్దిపేట సీఐ వాసుదేవరావు కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని ఖాదర్‌పురాకు చెందిన వీరబత్తిని బాలకిషన్ కుటుంబం శనివారం నుంచి కనిపించడంలేదు. బాలకిషన్ కుటుంబంలో మొత్తం ఐదుగురు తమ ఫోన్లు ఇంట్లో వదిలి వెళ్లారు. స్థానికులు, బంధువులు వీరు ఏదైనా ఊరికి వెళ్లారని అనుకున్నారు. రెండు రోజులైనా వారి జాడతెలియక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు అప్పులు ఉన్నాయని, డబ్బులు ఇవ్వాల్సిన వారు ఇవ్వకపోవడంతో వడ్డీలు కూడా కట్టలేక పోతున్నానని, అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్టు బాలకిషన్ లేఖ రాసినట్టు బంధువులు పోలీసులకు తెలిపారు. సిద్దిపేట ఏసీపీ మధు సోమవారం బాలకిషన్ ఇంటిని సీఐ వాసుదేవరావుతో కలిసి వెళ్లి పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ తెలిపారు.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మహిళల) రాత పరీక్ష ఫలితాలను తెలంగాణ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం విడుదల చేసింది. బోర్డు వెబ్‌సైట్‌లో మార్కుల జాబితా అందుబాటులో ఉందని.. హాల్‌టికెట్, ఇతర వివరాలు నమోదు చేసి మార్కులు చెక్ చేసుకోవాలని బోర్డు సూచించింది. త్వరలోనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామని ప్రకటించింది. మొత్తం 1,931 పోస్టులకుగానూ కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించగా 20,600 మంది అభ్యర్థులు పాల్గొన్నట్టు బోర్డు వెల్లడించింది.

పని ఒత్తిడితో ఓలా టెకీ ఆత్మహత్య!

బెంగళూరు: ఓలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ 'ఓలా కృత్రిమ్'లో మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న నిఖిల్ సోమ్‌వాన్షి ఆత్మహత్య ఘటన సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. అత్యంత దారుణమైన పని సంస్కృతి వల్లే నిఖిల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మరో ఉద్యోగి జాతీయ మీడియాతో చెప్పాడు. కాగా, ఈ అంశంపై ఓలా స్పందిస్తూ, వ్యక్తిగత సెలవుల్లో ఉండగా నిఖిల్ ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నది.

కాంగ్రెస్ రాజకీయానికి మేడిగడ్డ బలి!

- ఎన్‌డీఎస్‌ఏ నివేదికకు ముడిపెట్టిన రేవంత్ ప్రభుత్వం
- రిపోర్టు వచ్చాకే ప్రాజెక్టు పునరుద్ధరణ అని కాలపాయపన
- నివేదిక వచ్చి 20 రోజులు గడిచినా పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- విచారణలు, కమిషన్లకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వం
- ఈసారీ నీటి ఎత్తిపోతలు లేనట్టేనా అని రైతుల ఆందోళన
- తాజాగా మరోసారి కాళేశ్వరం కమిషన్ గడువు పొడగింపు

హైదరాబాద్, మే19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ బలవుతున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హస్తం పార్టీ కుటిల పన్నాగాలతో ప్రాజెక్టు పడావు పడుతున్నదని ప్రతిపక్షపార్టీల నేతలు, రైతులు మండిపడుతున్నారు. మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగుబాటు ఘటనను కాంగ్రెస్ మొదటి నుంచి రాజకీయాలకే వాడుకుంటున్నదని, విచారణలు, కమిషన్ల పేరిట బద్నాం చేయడమే తప్ప పునరుద్ధరణ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నీళ్లు ఇవ్వాలనే సోయి లేకుండా సర్కారు పెద్దలు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. నిన్నమొన్నటి వరకు ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదిక వచ్చిన అనంతరమే పునరుద్ధరిస్తామంటూ సాకులు చెప్పిన సర్కారు, ఇప్పుడు రిపోర్టు వచ్చి 20రోజులైనా ఆ ఊసే ఎత్తకపోవడం నిదర్శనంగా నిలుస్తుందని చెప్తున్నారు. ప్రభుత్వం తీరుతో వచ్చే సీజన్‌లోనూ నీటి ఎత్తిపోతలు లేనట్టేనని ఇరిగేషన్ అధికారులు తేల్చిచెప్తున్నారు.

ఆది నుంచీ కుమ్మక్కు రాజకీయమే?

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ ఆది నుంచీ కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని బీఆర్ఎస్ నేతలు, రైతులు, రైతుసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టును చేపట్టిన నాటి నుంచి అనేక అసంబద్ధ అంశాలతో విషప్రచారం చేస్తూ వచ్చాయని గుర్తుచేస్తున్నారు. ఇక 2023అక్టోబర్‌లో మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లో పిల్లర్ కుంగిపోయిన ఘటనను అదునుగా తీసుకుని, ప్రాజెక్టుపై మరింతగా దుష్ప్రచారం మొదలుపెట్టాయని చెప్తున్నారు. ఆ ఘటన జరిగిన వెంటనే బీజేపీ నేతలు కేంద్రానికి లేఖ రాయడం, హుటాహుటినా ఎన్‌డీఎస్‌ఏ రంగంలోకి దిగడం, ఎలాంటి పరిశీలనలు చేయకుండానే నివేదిక పేరిట కాంగ్రెస్, బీజేపీ హడావుడి చేశాయని ఉదహరిస్తున్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే కాంగ్రెస్ నేతలు అలాంటి రాజకీయాలకు పూనుకున్నారని, ప్రాజెక్టు సందర్శన పేరిట హడావుడి చేశారని విమర్శిస్తున్నారు.

ఎంక్వయిరీలు ఏమయ్యాయి?

కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించిందని ప్రతిపక్షాల నేతలు గుర్తుచేస్తున్నారు. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేసిందని, విచారణ అంశాలను అనుకూల మీడియా సంస్థలకు లీకులు ఇస్తూ ప్రాజెక్టులపై అసత్య ప్రచారాలకు తెరలేపిందని చెప్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా, ఆ తర్వాత ఏదైనా అంశంలో డిఫెన్స్‌లో పడిపోయిన ప్రతీ సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును తెరమీదకు తీసుకురావడం పరిపాటిగా మారిపోయిందని మండిపడుతున్నారు. తుది నివేదిక ఏడాదిన్నరపాటు కాలయాపన చేసిన ఎన్‌డీఎస్ బీఆర్ఎస్ రజతోత్సవానికి రెండు రోజుల ముందే రిపోర్ట్ ఇవ్వడం, అది ఇరిగేషన్‌శాఖకు చేరకముందే బయటకు లీక్ కావడం కాంగ్రెస్, బీజేపీల కుమ్మక్కు కుట్రలకు అద్దం పడుతున్నదని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికను సమర్పించి 20రోజులు గడిచినా కాంగ్రెస్ పెద్దలు దాని ఊసే ఎందుకు ఎత్తడంలేదని ప్రశ్నిస్తున్నారు.

కమిషన్ గడువు మళ్లీ పొడగింపు

నివేదిక సమర్పించేందుకు కాళేశ్వరం కమిషన్ సిద్ధమవుతున్న తరుణంలో ఊహించని విధంగా కాంగ్రెస్ సర్కారు కమిషన్ గడువును జూలై31 వరకు గడువును పెంచింది. విజిలెన్స్ నివేదికను, ఎన్‌డీఎస్‌ఏ నివేదికను సైతం కమిషన్ అధ్యయనం చేసిన కమిషన్ సొంతంగా సేకరించిన సమచారంతోపాటు, ఆయా నివేదికల్లోని అంశాలన్నింటినీ క్రోడీకరించి దాదాపు 400పేజీలతో రిపోర్టును సైతం సిద్ధం చేసినట్లు సమాచారం. మరో రెండురోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు కమిషన్ సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. కానీ కమిషన్ గడువును ప్రభుత్వం మరో రెండునెలలు పొడిగించడం వెనుక ఆంతర్యమేంటో అర్థం చేసుకోవచ్చని అని బీఆర్ఎస్ నేతలు, నీటిపారుదలరంగ నిపుణులు మండిపడుతున్నారు.

ఆదిత్యకు డిగ్రీ పట్టా

సోషల్ మీడియాలో పుత్రోత్సాహాన్ని పంచుకున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పెద్ద కుమారుడు ఆదిత్య అమెరికాలోని ఓక్ ఫారెస్ట్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు. ఇటీవల అమెరికాలో జరిగిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత, అనిల్ కుమార్ దంపతులు హాజరయ్యారు. ఆదిత్య గ్రాడ్యుయేషన్ పట్టా పుచ్చుకున్న ఫొటోను ఎమ్మెల్సీ కవిత సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి, ఆనందాన్ని వ్యక్తంచేశారు. 'ఆదిత్యా నీ చిట్టి చేతిని పట్టుకోవడం నుంచి నువ్వు డిగ్రీ పట్టా పట్టుకోవడం వరకు చూశాను. ఇది ఎంతో గొప్ప ప్రయాణం. నువ్వు చాలా కష్టపడ్డావు. ఎంతో ఎదిగావు. మేమందరం గర్వపడేలా చేశావు' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఒక తల్లిగా ఎంతో గర్వపడుతున్నానని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమెరికాలోనే ఉన్న ఎమ్మెల్సీ కవిత ఈనెల 29న హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

సర్వే రెమ్యునరేషన్ మంజూరు చేయాలి

ఖమ్మం అర్బన్, మే 19 : సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రెమ్యునరేషన్, ఎస్ఎస్సీ స్పాట్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, నాగేశ్వరరావు మాట్లాడుతూ నవంబర్ 2024లో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఆరు నెలలు పూర్తయినప్పటికీ రెమ్యునరేషన్ మంజూరు చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. ఆంగ్లం, గణితం ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు స్పాట్ బకాయిలు విడుదల చేయలేదని వాపోయారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- ఎల్లూరులో హతమార్చి.. చిన్నరాస్పల్లిలో దాచి!

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలో పులి మృతిని చాలెంజ్‌గా తీసుకున్న వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డ్ చెన్నై స్టేట్ విజిలెన్స్ అధికారి జయప్రకాశ్ బృందం ఆధ్వర్యంలో 30మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పులిని హతమార్చింది తామేనని వారు ఒప్పుకోవడంతోపాటు, పులి అవశేషాలను ఎక్కడ దాచింది వెల్లడించినట్టు తెలిసింది. సోమవారం సదరు వేటగాళ్లను తీసుకొచ్చి చిన్నరాస్పల్లిలోని ఓ వ్యక్తి ఇంటి వెనుకాల దాచిపెట్టిన పులి గోర్లు, తల, కాళ్లు, చర్మం స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. -దహెగాం/పెంచికలపేట్



చర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన వలస ఆదివాసీలు

తహసీల్‌ను ముట్టడించిన ఆదివాసీలు

కోయ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్

చర్ల, మే 19 : ఎన్నో ఏళ్లుగా మండల సరిహద్దుల్లో స్థిర నివాసం ఏర్పర్చుకుని ఉంటున్న తమకు కోయ కుల ధ్రువీకరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తహసీల్ కార్యాలయాన్ని వలస ఆదివాసీలు సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రేషన్‌కార్డు, ఓటు హక్కు కల్పించిన ప్రభుత్వం కోయ కుల ధ్రువీకరణ పత్రాలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరికావడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఉన్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ మొగిలి శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు.

బాధిత పూజారిపైనే ఉల్టా కేసు!

- బాసర ఆలయ పూజారి సంజీవ్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డ విద్యానందగిరి అనుచరుడు
- స్వామిజీ ఆదేశిస్తే చంపేస్తానని తీవ్రస్థాయిలో బెదిరింపులు!
- పూజారిని బైండోవర్‌పై విమర్శలు

మంచిర్యాల, మే 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అన్ని కులాల వారికి వేదాలు నేర్పిస్తానంటూ బాసరకు వచ్చిన వేదవిద్యానందగిరి అనే ఆంధ్రా సాములోరి ఆశ్రమం వరుస వివాదాలకు కేంద్రంగా మారింది. వేద పాఠశాలలో ఓ విద్యార్థి తీవ్రగాయాలతో ప్రాణాపాయస్థితికి చేరడం, ఆ కేసులో సాక్షిగా ఉన్న విద్యార్థి అనుమానాస్పదంగా చనిపోవడం ఇటీవల సంచలనంగా మారింది. బాధిత విద్యార్థుల కుటుంబ సభ్యులు స్వామిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పుష్కరఘాట్ కబ్జా, బీజాక్షరాల పేరుతో దందాపై వరుస వార్తా కథనాలు వెలువడ్డాయి. సాములోరి లీలలపై ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. కమిటీ విచారణ జరుగుతుండగానే వేదవిద్యానందగిరి ప్రధాన అనుచరుడు నూకం రామారావు ఈనెల 14న రాత్రి బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్ పూజారిపై దాడి చేశారనే విషయం బయటకు వచ్చింది. స్వామిజీ ఆదేశిస్తే చంపేస్తానని తనను హెచ్చరించారని, బాసర పోలీసులకు సంజీవ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా జీడీలో ఎంట్రీ చేశారు.

అర్చకుడిపైనే ఉల్టా కేసు!

మరుసటిరోజు అర్చకుడు సంజీవ్‌కుమార్‌పై పోలీసులకు రామారావు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ముందురోజు తాను ఇచ్చిన ఫిర్యాదుకు బదులుగా పోలీసులు ఇష్టమొచ్చినట్టుగా ఫిర్యాదు రాసుకున్నారని సంజీవ్‌కుమార్ చెప్తున్నారు. ఫిర్యాదును, సెక్షన్లను మార్చారని తెలిపారు. తలపై దాడి చేశారని, బూతులు తిట్టారని, చంపేస్తానంటూ బెదిరించారని తాను ఫిర్యాదులో పేర్కొంటే.. ఆ వివరాలు లేకుండా పోలీసులు ఫిర్యాదును రాసుకున్నారని చెప్పారు.

సీసీటీవీ పుటేజీతో వెలుగులోకి నిజాలు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన మరుసటి రోజు గురువారం పూజారిపై దాడి చేసిన రామారావు ప్రెస్‌మీట్ పెట్టారు. సంజీవ్‌తో వాగ్వాదం జరిగిందని, దాడి చేయలేదని చెప్పుకొచ్చారు. ఓ సీసీటీవీ పుటేజీని విడుదల చేశారు. ప్రెస్‌మీట్ జరిగిన కాసేపటికే స్థానికులు వాట్సాప్ గ్రూపుల్లో సీసీటీవీ దృశ్యాలు విడుదల చేశారు. అర్చకుడు సంజీవ్‌తో రామారావు గొడవ పడటం, దాడి చేయడం ఆ వీడియోలో కనిపిస్తున్నది. ఈ దృశ్యాలను పోలీసులు పట్టించుకోవడం లేదని సంజీవ్ చెప్తున్నారు.

బైండోవర్ ఎందుకు చేసినట్టు?

దాడికి గురైన అర్చకుడు సంజీవ్‌ను పోలీసులు తహశీల్దార్ ముందు బైండోవర్ చేశారు. రామారావు, సాములోరిపై చర్యలు తీసుకోకుండా తనపై ఉల్టా కేసు పెట్టడంలో ఆంతర్యమేంటో అర్థం కావడంలేదని సంజీవ్ ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పూజారి ఇచ్చిన ఫిర్యాదు చాలా పెద్దగా ఉందని, అందుకే అతడి సమక్షంలో చిన్నగా రాసి, సంతకం తీసుకున్నామని ఎస్సై శ్రావణి చెప్తున్నారు.

31న జలవిహార్‌లో నిర్వహించే టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్‌ను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరిస్తున్న మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లంనారాయణ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ తదితరులు

మలిదశ ఉద్యమానికి టీజేఎఫ్ దిక్సూచి

- నాడు ఆంధ్రా పెత్తనానికి ఎదురొడ్డి ఉద్యమానికి ఊపిరిపోసింది
- 31న జలవిహార్‌లో ఘనంగా టీజేఎఫ్ రజతోత్సవ వేడుకలు
- మీడియా అకాడమీ మాజీ చైర్మన్, ఫోరం అధ్యక్షుడు అల్లం నారాయణ

ఖైరతాబాద్, మే 19 : మలిదశ తెలంగాణ ఉద్యమానికి టీజేఎఫ్(తెలంగాణ జర్నలిస్టుల ఫోరం)దిక్సూచిగా నిలిచిందని రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్, ఫోరం అధ్యక్షుడు అల్లం నారాయణ పేర్కొన్నారు. టీజేఎఫ్ 25వ వసంతోత్సవం సందర్భంగా ఈనెల 31న జలవిహార్ వేదికగా ఉదయం 11 గంటలకు జరిగే రజతోత్సవ వేడుకల పోస్టర్‌ను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ జర్నలిస్టు చంటి క్రాంతికిరణ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. 2001లో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన సంవత్సరంలోనే మొదటిసారిగా తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆవిర్భవించినట్టు తెలిపారు. ఆంధ్రా మీడియా పెత్తనం సాగుతున్న తరుణంలో, జర్నలిస్టులు తటస్థంగా ఉండాలన్న ఒత్తిళ్ల సమయంలో తెలంగాణ ప్రజలతో కలిసి నడిచేందుకు టీజేఎఫ్ ఆలోచన పుట్టినట్టు చెప్పారు. ఆంధ్రా యాజమాన్యంలో పనిచేస్తూనే తెలంగాణ జర్నలిస్టులు ఒకే తాటిపై నిలబడడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. 2011లో ఖైరతాబాద్‌లోని శ్రీధర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ప్రజాప్రతినిధుల సమక్షంలో మాక్ అసెంబ్లీ, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించడం, తెలంగాణ ఉద్యమ సెగ ఢిల్లీకి తాకేలా టీజేఎఫ్ 2వేల మందిని తరలించడం, గన్‌పార్క్ నుంచి ఆర్టీసీ కల్యాణమండపం వరకు 5 వేల మందితో నిర్వహించిన ర్యాలీ టీజేఎఫ్ చరిత్రలో మైలురాళ్లని గుర్తుచేశారు. లక్షలాది మందితో నిర్వహించిన మిలియన్ మార్చ్, సాగరహారానికి మూలకారణం కూడా టీజేఎఫ్ కావడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని ఎత్తుకొని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఘనత టీజేఎఫ్‌కే దక్కిందని స్పష్టంచేశారు. భవిష్యత్తు ఉద్యమాలకు టీజేఎఫ్ అనుసరించిన పంథా స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ఈ చరిత్రను చిరస్మరణీయంగా ఉంచేందుకు రజతోత్సవ వేడుకలు జరుపనున్నామని, ఏడాదిపాటు వేడుకలు నిర్వహించాలని సంకల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏ రమణకుమార్, పీ శశికాంత్, ఎంవీ రమణ, పీ యోగానంద్, ఎల్ కల్యాణ్‌చక్రవర్తి, యార నవీన్‌కుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, టీయూడబ్ల్యూజే నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాకేశ్‌రెడ్డి, సోమేశ్వర్, కోశాధికారి వీ బాపూరావు, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అగస్టిన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల్లో గందరగోళం

ఎస్సీ గురుకులాల్లో ఎన్నడూ లేనివిధంగా కొత్త నిబంధనలు

- కాలేజీ ఆప్షన్ లేకుండానే దరఖాస్తుల స్వీకరణ
- ఏ కాలేజీలో.. ఏ కోర్సు ఉందో తెలియని పరిస్థితి
- ఒకేషనల్ కోర్సుల్లోనూ అనేక మార్పులు
- గ్రూపువారీ మాత్రమే ఆప్షన్‌కు అవకాశం
- బీజీ ఆమోదం లేకుండానే ఇష్టారీతిన నిర్ణయాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు.. విద్యార్థులు

హైదరాబాద్, మే19 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకులాల్లో ప్రవేశాలపై ఎన్నడూ లేనివిధంగా గందరగోళం నెలకొన్నది. ఇప్పటికే 5వ తరగతి ప్రవేశాల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేయగా, విద్యార్థులు జిల్లాలకు జిల్లాలే మారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానికతను కోల్పోయే అవకాశం ఉన్నది. తాజాగా ఇంటర్ ప్రవేశాల్లోనూ అదే గందరగోళం నెలకొంది. ఎస్సీ గురుకుల పరిధిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, సాధారణ ఇంటర్, ఒకేషనల్ జూనియర్ కాలేజీలు కలిపి 238 గురుకులాలు ఉన్నాయి. గతంలో సీవోఈ ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా రెండు దశల్లో రాత పరీక్ష నిర్వహించి, ప్రతిభకలిగిన విద్యార్థులను ఎంపిక చేసేవారు. ఐఐటీ, నీట్ శిక్షణ అందించేవారు. ఇక ఇంటర్, ఒకేషనల్ కాలేజీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించి మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయించేవారు. కానీ ఈ ఏడాది ఎస్సీ గురుకుల సొసైటీ సీవోఈలకు సంబంధించిన రాతపరీక్షను రద్దు చేసింది. ఎస్సీ గురుకుల సొసైటీలకు చెందిన విద్యార్థులకే సీవోఈల్లో ప్రవేశాలను కల్పించాలని నిర్ణయించింది. ఇప్పటికే వారికి రాతపరీక్ష నిర్వహించింది. ఇక నాన్ సీవోఈ, ఒకేషనల్ గురుకుల కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి గత ఏప్రిల్‌లో నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 25వ తేదీన ఫలితాలను వెల్లడించేందుకు సొసైటీ సిద్ధమైంది. అయితే దరఖాస్తు ప్రక్రియ అంతా గందగోళం నెలకొన్నది. వాస్తవంగా గతంలో దరఖాస్తులు స్వీకరించే సమయంలో సదరు విద్యార్థికి ఏ జిల్లాలో? ఎక్కడ ఏ కాలేజీలో, ఏ గ్రూపులో సీటు పొందాలనుకుంటున్నాడు? అనే అంశాలపై ప్రాధాన్యతాపరంగా ఆప్షన్ ఎంచుకునే అవకాశముండేది. ప్రస్తుతం తీసుకునే గ్రూపు తప్ప కాలేజీని ఎంచుకునే అవకాశాన్ని సొసైటీ దరఖాస్తు సమయంలో ఇవ్వలేదు. సొసైటీనే మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆయా కాలేజీలకు కేటాయించే అవకాశమున్నదని తెలుస్తున్నది.

ఇంటర్‌బోర్డు నిబంధనలూ గాలికి.

ఇంటర్మీడియట్ కాలేజీలకు సంబంధించి నిర్ణయమేదైనా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అనుమతి తీసుకోవాలి. బోర్డు అనుమతి లేకుండా సీట్ల కేటాయింపులో నిర్ణయాలు తీసుకోకూడదు. కానీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థనే ఆ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నది. ఎస్సీ గురుకుల సొసైటీ నోటిఫికేషన్‌లో 238కాలేజీల వివరాలను మాత్రమే వెల్లడించింది. కానీ ఏ కాలేజీలో? ఏయే గ్రూపులు ఉన్నాయనే విషయాన్ని ఎక్కడా పేర్కొనలేదు. అదీగాక ఇటీవల దాదాపు 80గురుకుల కాలేజీల్లో గ్రూపులన్నీ మార్చింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీతోపాటు, ఒకేషనల్ కోర్సుల్లోనూ మార్పులు చేర్పులు చేసింది. కొన్ని కాలేజీలను కేవలం సైన్స్ గ్రూపులకే పరిమితం చేసింది. మరికొన్ని కాలేజీలను కేవలం ఆర్ట్స్ గ్రూపులకే పరిమితం చేసింది. మరికొన్నింటిలో మిశ్రమ కోర్సులను రన్ చేయాలని నిర్ణయించింది. ఒకేషనల్ కాలేజీల్లో కాళేశ్వరం జోన్‌లో ఒక్క ఒకేషనల్ కాలేజీ కూడా లేకపోవడం గమనార్హం.

కాలేజీల్లో గ్రూపుల మార్పు

గౌలిదొడ్డిలోని కళాశాలలో బైపీసీ, ఎంపీసీ గ్రూపులను గతంలో నడిపారు. కానీ ప్రస్తుతం కేవలం మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులకు 160 సీట్లు కేటాయించారు. ఇక్కడ చదివిన మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థులు ఎక్కడికి వెళ్లాలి? ఇక చిలుకూరులోని బాలుర పాఠశాలలో బైపీసీ, ఎంపీసీలో 40 సీట్లు చొప్పున ఉండేవి. ఇప్పుడు అక్కడ ఎంపీసీని రద్దు చేసి, కేవలం బైపీసీలో 160 సీట్లు కేటాయించారు. మరి రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థులను ఎక్కడ అడ్జస్ట్ చేస్తారు? అదేవిధంగా ఉప్పల్‌లో 200 సీట్లను, గౌలిదొడ్డి బాలికల్లో 160 సీట్లను, కరీంనగర్ అలుగునూర్‌లో 160 సీట్లను కేటాయించారు. మహేంద్రహిల్స్‌లో ఎంపీసీ రద్దు చేస్తూ బైపీసీలో 120 సీట్లను కేటాయించారు. ఫలక్‌నుమాలో ఎంపీసీని రద్దుచేసి బైపీసీలో 200 సీట్లు కేటాయించారు. ఒక ప్రణాళిక, పద్ధతి లేకుండా కాలేజీల్లో గ్రూపుల మార్పు చేశారని సొసైటీ ఉపాధ్యాయులే వెల్లడిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గద్వాల జిల్లాకు చెందిన విద్యార్థిని ఖమ్మం జిల్లాకు, ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థికి హైదరాబాద్‌లో సీటును కేటాయించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అనేకమంది విద్యార్థులు సొంతజిల్లాలకు బది